అట్టడుగు వర్గాలకు అండగా ప్రభుత్వం

- మాచాపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం
- పాల్గొన్న మంత్రి గుమ్మనూరు జయరాం
- నిరాజనం పలికిన గ్రామస్తులు



మాచాపురంలో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: అట్టడుగు వర్గాల ప్రజలకు అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు మంజూరు చేసి వారి కుటుంబాల్లో వెలుగులు నింపిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. దేవనకొండ మండలం మాచాపురం గ్రామంలో సర్పంచ్ అమరావతి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ.. గ్రామంలో అన్ని కులాలకు చెందిన 2,112 మంది లబ్ధిదారులకు రూ. 5,18,87,749 మేర సంక్షేమ పథకాలను మూడున్నరేళ్ల కాలంలో మంజూరు చేసినట్లు వివరించారు. ఇంటింటికీ వెళ్లి ఆ కుటుంబానికి అందిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్ అందజేశారు. గ్రామంలో పలు కాలనీలలో తాగునీటి ఎద్దడి తీర్చాలని గ్రామస్తులు మంత్రిని కోరారు. స్థానిక సచివాలయానికి మంజూరైన నిధులలో రూ.5 లక్షలతో తాగునీటి సమస్య పరిష్కరించాలని, అలాగే డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లు పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హంపిరెడ్డి, తెర్నెకల్ సర్పంచ్ అరుణకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు నిజాల్‌రెడ్డి, మన్‌మోహన్‌రెడ్డి, ప్రేమనాథ్‌రెడ్డి, దివాకర్‌నాయుడు, నారాయణరెడ్డి, తహసీల్దార్ సుదర్శనం, ఎంపీడీఓ గౌరీదేవి, ఏఓ సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరు టౌన్: సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. లబ్ధిదారులు కేఆర్ రాఘవేంద్ర రెడ్డికు రూ.3.70 లక్షలు, అరుణమ్మకు రూ.1.60 లక్షలు, వేణుగోపాల్‌కు రూ.75 వేలు, సరోజమ్మకు రూ.55 వేలు, వెంకటలక్ష్మమ్మకు రూ.1.10 లక్షలు. ఉదయ్ కుమార్‌కు రూ.15 వేలు. మొత్తం రూ.7.85 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎర్రకోట జగన్ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొంది ఆర్థికంగా నష్టపోయిన వారు సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, ముగతి వీరుపాక్షిరెడ్డి, వెంకటేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని అడ్డుకోలేరు

ఆలూరు: వైఎస్సార్‌సీపీ హయాంలో గడిచిన మూడున్నరేళ్లలో ఆలూరు నియోజకవర్గంలోని 270 ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.60 కోట్లు ఖర్చు చేసినట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. దేవనకొండ మండలం మచాపురం ఎంపీయూపీ పాఠశాలలో మంగళవారం రూ.30 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ.. గత పాలకులు ప్రభుత్వ పాఠశాలలో కనీస సదుపాయాలు కల్పించలేకపోయారని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధితో పాటూ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చారని కొనియాడారు. విద్యార్థులకు సాంకేతిక విద్య కోసం బైజూస్ ఒప్పందంతో ట్యాబ్‌లను పంపిణీ చేసినట్లు గుర్తు చేశారు. అన్ని వర్గాలకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌పై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అర్థరహితంగా విమర్శలు చేయడాన్ని మంత్రి తప్పుపట్టారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ నేతలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని తేల్చిచెప్పారు. స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మన బడి నాడు-నేడు పనులకు భూమి పూజ చేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం



క్లుప్తంగా

ఘనంగా దస్తగిరి స్వామి ఉరుసు

నందవరం: మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో వెలసిన దస్తగిరి స్వామి ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మంగళవారం దర్గాలో ప్రత్యేక ఫాతేహల్ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, వైస్ ఎంపీపీ నడిపి షేక్ సాహెబ్, సర్పంచ్ మద్దీశ్వరి, ఎంపీటీసీ సుశీలమ్మ పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రాత్రి చెక్క భజనలు, పంచమాంకములు పౌరాణిక నాటకం, తత్వ విచారణలు చేపట్టారు. దర్గాను విద్యుత్ దీపాలతో విశేషంగా అలంకరించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

భూహక్కు పత్రాల పంపిణీ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి గ్రామ సచివాలయంలో మంగళవారం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు – భూరక్ష పథకం పత్రాలను తహసీల్దార్ జయన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం రీసర్వే చేపట్టిందన్నారు. సర్వే పూర్తైన గ్రామాల్లోని రైతులకు భూ హక్కు పత్రాలను అందజేస్తున్నారన్నారు. సర్వే చేసే సమయంలో రైతులు తమ పొలాల వద్ద ఉంటే సమస్యలు రావని తెలిపారు. ఇక నుంచి భూ రికార్డులు పక్కాగా ఉంటాయన్నారు. అనంతరం రీసర్వే పూర్తయిన రైతులకు భూహక్కు పత్రాలను అందజేశారు.

దైవందిన్నెలో కూలీల వలస బాట



గుంటూరుకు వలస వెళ్తున్న ఎస్సీ కాలనీ వాసులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిలోని దైవందిన్నె గ్రామం ఎస్సీ కాలనీవాసులు మంగళవారం రెండు ఆటోల్లో గుంటూరుకు వలస వెళ్లారు. క్రిస్మస్, జనవరి 1, సంక్రాంతి పండుగలు ముగిసిపోవడం, గ్రామాల్లో వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టడంతో మిరప, పత్తి తీసేందుకు గుంటూరుకు వలస వెళ్తున్నారు. ఉపాధి హామీ పనులు కల్పిస్తున్నా ఇంట్లో వారందరికీ అక్కడ కూలి పనులు దొరుకుతుండటంతో వెళుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఎస్సీ కాలనీకి చెందిన పదుల సంఖ్యలో ప్రజలు ఆటోల్లో వెళ్లారు. అధికారులు స్పందించి ఉపాధి పనులు కల్పనపై దృష్టి సారించి వలసలు నివారించాలని పలువురు కోరుతున్నారు.

బహుమతుల ప్రదానం

గోనెగండ్ల: సంక్రాంతి పండుగ పురస్కరించుకొని గోనెగండ్లకు చెందిన నాగరాజు ఆధ్వర్యంలో మూడు రోజులుగా కొనసాగిన క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. విజేత జట్టుకు రూ.5016, రన్నర్ ఆర్‌సీబీ జట్టుకు రూ.3 వేలు నగదును మంగళవారం అడ్వకేట్ వెంకటేష్, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కరుణాకర్ చేతుల మీదుగా అందజేశారు. క్రీడాకారులు రవి, సోమన్న, నాగేంద్ర, నాగేష్, నరసన్న తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసిందని, గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీహెచ్ఓ బలరాం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లకు ఓఈఈఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకునేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు త్వరల్లో ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక దృష్టి సారించాలని, క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని ఆశా వర్కర్లకు సూచించారు. పీహెచ్‌ఎన్ లక్ష్మీదేవి, హెల్త్ సూపర్‌వైజర్ ఈరమ్మ పాల్గొన్నారు.

24న సుంకులమ్మవ్వ దేవర

ఆస్పరి: మండలంలోని యాటకల్లు గ్రామంలో ఈనెల 24, 25 తేదీల్లో సుంకులమ్మవ్వ, దుర్గెమ్మవ్వ దేవర నిర్వహించనున్నట్లు సర్పంచ్ సుధమ్మ, గ్రామ పెద్దలు మంగళవారం తెలిపారు. అమ్మవారి ఆలయాలలో ప్రత్యేక పూజలు, కుంభాల ఊరేగింపు, మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

సీజనల్ హాస్టల్ తనిఖీ

నందవరం: మండల పరిధిలోని మాచాపురం గ్రామంలో సీజనల్ హాస్టల్‌ను మండల విద్యాధికారి సుదర్శన్‌రెడ్డి తనిఖీ చేశారు. మంగళవారం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో వైకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే హాస్టల్‌ను ఏపీఎం చిన్న వీరన్న ఆధ్వర్యంలో తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యం, భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ .. భోజనం నాణ్యత బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. వలస వెళ్లే వారి పిల్లలు చదువులకు దూరం కాకుండా సీజనల్ హాస్టళ్లలో చేర్పించాలని కోరారు. సర్పంచ్ పల్లదొడ్డి కిష్టప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు కోటేశ్వరరావు, సత్యన్న, కోటేప్ప ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు

నందవరం: గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆవిష్కరించారు. మంగళవారం కర్నూలులోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సేవలను విస్తృతం చేయాలన్నారు. స్పందన అర్జీలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాడుగుల రాజేష్,కర్నూలు జిల్లా అధ్యక్షుడు శేఖర్, ప్రధాన కార్యదర్శి వీరేష్, ఉపాధ్యక్షులు శశికళ, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్షావలి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు వెంకటేశ్వర్లు, సుధీర్ తదితరలు పాల్గొన్నారు.

దళితవాడలో తీరిన తాగునీటి సమస్య



ఎల్లార్తి ఎస్సీ కాలనీలో పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

హొళగుంద: ఎల్లార్తి గ్రామం ఎస్సీ కాలనీలో ఎన్నో ఏళ్లుగా నెలకొన్న తాగునీటి సమస్య మంగళవారం పరిష్కారమైంది. సర్పంచ్ కురువ చాముండేశ్వరి ఆధ్వర్యంలో పైప్‌లైన్ ఏర్పాటు చేసి గ్రామస్తుల తాగునీటి సమస్యను తీర్చారు. చాలాకాలంగా తాగునీటి సరఫరా లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో సర్పంచ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో తాగునీరు, ఇతర ఏ సమస్య అయినా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని, గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని ఆమె కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దర్గన్న, ఎస్కే గిరి తదితరులు ఉన్నారు.

వృథాగా తాగునీరు



వృథాగా పారుతున్న తాగునీరు

గోనెగండ్ల: స్థానిక ఎస్సీ కాలనీలో కొన్ని రోజుల నుంచి తాగునీరు వృథాగా పారుతుంది. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం ఎస్సీ కాలనీలో కుళాయిల ద్వారా తాగునీరు వదిలారు. కుళాయికి మూత లేకపోవడంతో తాగునీరు వృథాగా పారుతూ మురికి కాలువలో కలిసిపోతోంది. కొన్ని రోజుల నుంచి మంచినీరు ఇలా వృథాగా పోతుండడంతో గ్రామస్తులు పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాగడానికి మంచినీరు లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో ఇలా నీరు వృథాగా పోతున్నా అరికట్టలేక పోతున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

పెద్దగోనెహాళ్‌లో పారిశుద్ధ్య పనులు

హొళగుంద: పెద్దగోనెహాళ్ సర్పంచ్ కొత్తింటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు జరిగాయి. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో వీధుల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకున్నారు. డ్రైనేజీలలో చెత్త చెదారాన్ని, మురుగు నీటిని తొలగించారు. దోమలు, వ్యాధులు ప్రబలకుండా వీధుల్లో చెత్తకుప్పలను తొలగించి బ్లీచింగ్ పౌడర్‌ను చెల్లించారు. గ్రామస్తులు చెత్తచెదారాన్ని వీధుల్లో పారవేయకుండా శుభ్రత పాటించాలని సర్పంచ్ కోరారు.

ఆరని నిప్పు

హొళగుంద: స్థానిక పెద్ద చెరువు మీద ఉన్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ (చెత్త సేకరణ కేంద్రం) వద్ద నిల్వ చేసిన చెత్త దిబ్బలకు అంటుకున్న మంటలు ఇంకా అదుపులోకి రావడం లేదు. మంగళవారం పొగలు వ్యాపించడంతో పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్, నాయకుడు పంపాపతి ట్యాంకర్‌ను పెట్టి పారిశుద్ధ్య కార్మికులతో మంటలు వ్యాపించకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. షెడ్ పరిసరాల్లో స్థానిక రైతులు పదుల సంఖ్యలో వేసుకున్న గడ్డివాములకు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకుండా శ్రమిస్తున్నారు.

తాగునీటిని సరఫరా చేయాలి



పంచాయతీ కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తున్న కాలనీవాసులు

మద్దికెర: గ్రామంలోని మాల వీధికి నీటి సౌకర్యం కల్పించాలని కాలనీ వాసులు తిమ్మప్ప, కవి కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ గతంలో మాల వీధిలోని ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి నీరు సరఫరా చేసేవారన్నారు. అయితే ట్యాంకు నుంచి ఇతర ప్రాంతాలకు నీటిని సరఫరా చేయడం వల్ల తమ కాలనీకి నీటి కష్టాలు మొదలయ్యాయన్నారు. పంచాయతీ అధికారులు స్పందించి గతంలో మాదిరిగా తాగునీటిని సరఫరా చేయాలని కోరారు.

ఆస్పరి - బిల్లేకల్లు రోడ్డుకు మహర్దశ



నేడు.. తారురోడ్డుగా రూపుదిద్దుకున్న ఆస్పరి - బిల్లేకల్లు రహదారి



నాడు.. గుంతలమయంగా ఉన్న రోడ్డు

ఆస్పరి: మండలంలో బిల్లేకల్లు నుంచి ఆస్పరి, చిన్నహోతూరు రోడ్డుకు రూ.4.80 కోట్లతో మరమ్మతులు చేపట్టడంతో వాహనాల రాకపోకలకు సౌకర్యంగా మారింది. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బిల్లేకల్లు నుంచి ఆస్పరి, చిన్నహోతూరుకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలతో అధ్వానంగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉండేది. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం మండలంలోని బిల్లేకల్లు, ఆస్పరి, చిన్నహోతూరు వరకు 17 కిలోమీటర్లు రోడ్డు మరమ్మతులకు రూ.4.80 కోట్లు మంజూరు చేయించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు తారు రోడ్డు నిర్మించడంతో వాహనాల రాకపోకలకు అనుకూలమైంది. ప్రస్తుతం బిల్లేకల్లు నుంచి ఆస్పరి రైల్వే గేటు వరకు మరమ్మతు పనులు చేశామని, మిగతా చిన్నహోతూరు వరకు త్వరలోనే పనులు పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈ శ్వేత తెలిపారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

హొళగుంద: మండల కేంద్రంలోని సీజనల్ హాస్టల్ విద్యార్థులకు మంగళవారం ఉషోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రెసిడెంట్ చిన్నహ్యాట నాగరాజు ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అంబేడ్కర్, సావిత్రిబాయి పూలే తదితర మహనీయుల జీవిత చరిత్రపై వ్యాసరచన అలాగే ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఘనంగా దేవర

తుగ్గలి: మండల పరిధిలోని జీ.ఎర్రగుడిలో పెద్దమ్మ, సుంకులమ్మ దేవర ఉత్సవాలు మంగళవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. వేకువజామున ప్రత్యేక పూజల అనంతరం మహిళలు బోనాలు సమర్పించారు. గ్రామస్తులు ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి, పత్తికొండ మాజీ ఎంపీపీ ఎస్.నాగరత్నమ్మ దంపతులు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఈ శ్యాంబాబు ఉత్సవాలకు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక నాయకులు జిట్టా నాగేష్, రామచంద్రారెడ్డి, జెడ్పీటీసీ పులికొండనాయక్, జిట్టా లక్ష్మీదేవి, సర్పంచ్ వరలక్ష్మి, ఎంపీటీసీ భారతమ్మ పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో దేవర

మండలంలోని గిరిగెట్లలో అంకాలమ్మ, చిన్న జొన్నగిరిలో సుంకులమ్మ,ఎద్దులదొడ్డిలో సుంకులమ్మ, మారెమ్మ దేవర ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. దేవర ఉత్సవాలతో ఆయా గ్రామాల్లో బంధుమిత్రుల రాకతో సందడి నెలకొంది.

21 నుంచి పెద్దపుల్లయ్య ఆరాధన

కృష్ణగిరి: మండల పరిధిలోని సంగాల గ్రామంలో వెలసిన పెద్దపుల్లయ్య ఆరాధన మహోత్సవాలను ఈ నెల 21 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆల్ యాద్రూష్ దర్గా కమిటీ సభ్యులు గిడ్డయ్య, దస్తగిరి తదితరులు మంగళవారం తెలిపారు. గూటుపల్లె పెద్దరాజు స్వామి ఆశీస్సులతో ఈ కార్యక్రమం గత ఎనిమిదేళ్లుగా చేపడుతున్నట్లు వారు తెలిపారు. 21న పెద్దపుల్లయ్య దర్గాలో గంధం సమర్పించి రాత్రి కమిటీ ఆధ్వర్యంలో భజన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 22న రాత్రి నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం గుండంపాడు గ్రామం నాటక బృందంచే పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ రెండు రోజులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వారు తెలియజేశారు.

'జగనన్న తోడు'కు 232 మంది లబ్ధిదారులు

మద్దికెర: మండలంలోని ఆయా గ్రామాలలో జగనన్న తోడు పథకం కింద 232 మంది లబ్ధిదారులు ఎంపికైనట్లు ఏపీఎం సూర్యప్రకాష్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడతూ.. ఈ పథకం ద్వారా చిరువ్యాపారులు, మహిళలకు వడ్డీ లేకుండా బ్యాంకుల ద్వారా రుణాలు అందించి వారు ఆర్థికంగా ఎదిగేందుకు సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

31న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

కృష్ణగిరి: మండల పరిధిలోని ఆలంకొండ గ్రామ సమీపంలోని కొండపై వెలసిన దస్తగిరయ్య స్వామి ఉరుసు సందర్భంగా ఈ నెల 31వ తేదీన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.15 వేలు, రెండవ బహుమతి రూ.12 వేలు, మూడవ బహుమతి రూ.8 వేలు, నాల్గవ బహుమతి రూ.5 వేలను దాతల సహకరంతో అందించనున్నట్లు వారు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు ఉదయం 8 గంటలలోపు రూ.400 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో పాల్గొనే వారు తమ పేర్లు నమోదుకు 79937 60575, 93980 34565 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

మద్దికెర: రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ–కేవైసీ నమోదు చేయించుకోవాలని ఏఓ హేమలత మంగళవారం తెలిపారు. రైతులు సంబంధిత సచివాలయాలకు వెళ్లి వేలిముద్రలు వేసి నమోదు చేసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలు వర్తించవన్నారు.

వర్మీ కంపోస్టుతో అధిక దిగుబడులు

హొళగుంద: వర్మీ కంపోస్టు ఎరువుతో అధిక దిగుబడులు పొందవచ్చని హొళగుంద గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ సూచించారు. ఆయన మంగళవారం స్థానిక నాయకుడు పంపాపతితో కలిసి హొళగుంద సమీపంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్‌లో తయారు చేసిన వర్మీ కంపోస్టు ఎరువును పరిశీలించారు. తడి, పొడి చెత్త నుంచి వర్మీ కంపోస్ట్ తయారు చేయడంతో పాటు గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగు పడేలా కృషి చేస్తున్నామన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కృష్ణగిరి: క్రీడాపోటీల్లో పాల్గొనడం వల్ల ఉల్లాసంగా ఉంటారని వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామిరెడ్డి, హుసేన్‌సాహెబ్ అన్నారు. కృష్ణగిరిలో దివంగత నేత చెరుకులపాడు నారాయణరెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రతిభ ఆధారంగా చదువు కంటే ముందుగా క్రీడల వల్లే గుర్తింపు వస్తుందన్నారు. మారుమూల గ్రామాల్లోనూ క్రికెట్‌కు ఎంతో ఆదరణ ఉందన్నారు. క్రీడల్లో రాణించే వారిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పోత్సాహించాలన్నారు. ఆరు రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ టోర్నీలో 16 జట్లు పాల్గొనగా కృష్ణగిరి సీనియర్, కృష్ణగిరి కేవీఆర్ జట్లు మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు నిర్వాహకులు శివారెడ్డి, మహేష్, మనోహర్, హరీష్‌రెడ్డి తెలిపారు. గెలుపొందిన జట్లకు రూ.10,016, రూ. 5,016 నగదు బహుమతులు అందజేశారు. నాయకులు బాల మద్దయ్య, సంజన్న, చిన్నషాలు, తిరుపాల్‌యాదవ్, వడ్డె సత్యం తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత మదార్‌పురం జట్టు



విజేత మదార్‌పురం జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతి అందిస్తున్న పెనికలపాటి జయరాముడు

వెల్దుర్తి: మండల పరిధిలోని నార్లాపురం గ్రామంలో సంక్రాంతి వేడుకలు, పెణికలపాటి రేణుకమ్మ జ్ఞాపకార్థం నిర్వహించిన సూపర్ 8 క్రికెట్ టోర్నీలో మదార్‌పురం లక్ష్మన్న జట్టు విన్నర్‌గా నిలిచింది. ఈనెల 12న ప్రారంభమైన టోర్నీలో 34 జట్లు పాల్గొన్నాయి. మంగళవారం జరిగిన ఫైనల్‌లో కృష్ణగిరి మండలం అమకతాడుకు చెందిన మిన్నల్ల ఎలెవెన్ జట్టుపై మదార్‌పురం జట్టు గెలుపొందింది. ఆ జట్టు తరపున బబ్లు హ్యాట్రిక్ వికెట్లు సాధించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. టోర్నీలో బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా మదార్‌పురం సాయిచరణ్, బెస్ట్ బౌలర్‌గా అమకతాడు చక్రి ఎంపికయ్యారు. విజేత జట్టుకు ట్రోఫీ, రూ.10,016 నగదు బహుమతిని పెనికలపాటి జయరాముడు ప్రదానం చేయగా, రన్నర్స్ అమకతాడు జట్టుకు నిర్వాహకులు వినయ్, నరసింహ, భాస్కర్, పాండు తదితరులు ట్రోఫీ, రూ.5,016 అందించారు. నార్లాపురం రజిని, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేవర ఉత్సవాలు ప్రారంభం

మద్దికెర: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో దేవర ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామస్తులు ప్రత్యేకంగా చేయించిన పంచలోహ ముఖం, నాగ పడగతో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. 14 ఏళ్ల తరువాత గ్రామ శాంతి కోసం దేవర ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు.

పంచలోహ ముఖం, నాగ పడగ అలంకరణలో అమ్మవారు



కర్ణాటక మద్యం స్వాధీనం

ఆలూరు: కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి నుంచి కోడుమూరుకు ఏపీ 21 ఎక్స్ 1949 కారులో మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి, కారును స్వాధీనం చేసుకున్న సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. దేవనకొండ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పత్తికొండ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దేవనకొండ ఎస్ఐ భూపాలుడు, సిబ్బంది రాత్రి కరివేముల గ్రామ శివారులో వాహన తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన కారును తనిఖీ చేయగా అందులో 25 బాక్సుల కర్ణాటక మద్యం ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ 24,500 ఉంటుందని అధికారులు తెలిపారు. మద్యం అక్రమంగా తలిస్తున్న మహేంద్ర, పక్కీరహుసేన్ బాషాను అరెస్ట్ చేసి పత్తికొండ కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు. దాడులలో పోలీసులు చెన్నయ్య, రవి, దస్తగిరి, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.